01ATP21_01ATP21.qxd 22-06-2023 AM 12:09 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 22 జూన్ 2023 పేజీలు : 04

# రామ్మా ...దీపమ్మా...

- అధికారిక సమీక్షలో వేదికపైకి సీఎం ఆహ్వానం
- వైసిపి ఇన్‌ఛార్జ్ మార్పు ఇక లాంఛనమేనా..?



వేదికపై సీఎం, మంత్రులతో దీపిక



ద్రాషస్థాయి సమీక్షలో పాల్గొన్న దృశ్యం

**హిందూపురం, జూన్ 21, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో ఏపిలోని 175 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో బుధవారం జరిగిన అధికారిక సమీక్షలో హిందూపురం నుండి ఆ పార్టీ నూతన నాయకురాలు దీపికా వేణురెడ్డి పాల్గొనడం వైసీపిలో సంచలనం కలిగించింది. స్థానిక పార్టీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ ఇక్బాల్ స్థానంలో కురుబ దీపిక వేణను అధిష్టానం నియమించనుందని ప్రచారం ఉన్న క్రమంలో సీఎం పేషీ నుంచి పిలుపు రావడంతో హుటాహుటిన ఈ తెల్లవారుజామున దీపిక ఆమె భర్త వేణురెడ్డి తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. సమీక్ష ప్రారంభంలో వేదికపై వైఎస్‌ఆర్‌కు నివాళులు అర్పించిన తర్వాత సీఎం జగన్ మాట్లాడుతూ రామ్మా.. దీపమ్మ.. అని ఆహ్వానించినట్లు సమాచారం. పార్టీ అధికారిక సమీక్షలో ఆమెను ఆహ్వానించడం ద్వారా అధిష్ఠానం సంకేతాలు పంపినట్టయింది. ఈ క్రమంలో ఇన్‌ఛార్జ్ మార్పు ప్రకటన ఇక లాంఛమేనని పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు సీఎం సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్ విజయవాడ నుండి హిందూపురానికి రాత్రి రానున్నారని ఎమ్మెల్సీ వర్గాలు వెల్లడించాయి.

# రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

- వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయండి
- కేంద్ర కమ్యునికేషన్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి



సీనియర్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి

**పెనుకొండ, జూన్ 21 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని కేంద్ర కమ్యునికేషన్ శాఖ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. నరేంద్రమోదీ పాలన 9 ఏళ్ల విజయవంతంగా పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్టీలో సీనియర్ నాయకులు కలువుకుని పార్టీ బలోపేతం కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో కేంద్ర కమ్యునికేషన్ సహాయ మంత్రి బుధవారం పెనుకొండలో పర్యటించారు. బిజెపి సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, యశ్వంత్‌పరిషత్ సంఘ పరివారం సీనియర్ నాయకులు సుంకం సత్యనారాయణ, ఇళ్లను సందర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. అనంతరం పట్టణంలోని భోగసముద్రం చెరువును సందర్శిం చారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 9 సంవత్సరాలు విజయవంతమైన పరిపాలన అందించారన్నారు. సుపరిపాల నను ప్రజలకు వివరించాలని ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలతో బిజెపి పార్టీ మమేకం కావాలని సంకల్పంతో నెల రోజులు బిజెపి పార్టీ దేశంలోని అన్ని ప్రాంతాలను ప్ పర్యటిస్తుందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వైకాపాప్రభుత్వం మైండ్ అండ్ వైన్స్ పై మాత్రమే పరిపాలన కొనసా గిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జ్ కేంద్ర సహాయ మంత్రి సునీల్‌దేవర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నేషనల్ సెన్సార్ బోర్డు నెంబర్ జి.ఎం.శేఖర్, ఎనుమల రామకృష్ణ, అంగడి రామాంజినేయులు, అసెంబ్లీ కన్వీనర్ బొట్లు శ్రీనివాసులు, కో కన్వీనర్ రవి, అమృతయాదవ్, ముత్యాలమ్మ, సుభద్రమ్మ, హనుమంతు యాదవ్, మండల అధ్యక్షులు సుభాష్‌చంద్రబోస్, సోమశేఖర్, సూర్యనారాయణ, మధుసూధన్, నారాయణ నాయక్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంఘం నేత నివాసంలో కేంద్ర మంత్రి

- మంత్రిని కలిసిన పలు సామాజిక నేతలు



మంత్రితో పార్టీ నేతలు

**హిందూపురం, జూన్ 21, ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లా బిజెపి ఇన్‌ఛార్జ్, కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ మంత్రి దేవసిన్హా చౌహాన్, రాష్ట్ర పార్టీ సంయుక్త ఇన్‌ఛార్జ్ సునీల్ దేవదర్ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చారు. స్థానిక బిజెపి నాయకులు, రాష్ట్ర బిసి సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.చలపతి నివాసానికి బుధవారం సాయంత్రం వచ్చిన మంత్రికి ఆ పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. బాణాసంచా పేల్చుతూ డోలు తప్పెటతో హోరు మధ్య ఆహ్వానం పలికారు. బిజెపి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అనుబంధ సంఘం సభ్యులు రమేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మేడికుర్తి హరి, పార్టీ కౌన్సిలర్ అంజలి, అమర్, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తేనేటి విందు మంత్రి స్వీకరించారు. తదుపరి వివిధ కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విహెచ్‌పి, భజరంగ్‌దళ్ తదితర బృందాల ప్రతినిధులు కేంద్రమంత్రిని కలిసి మాట్లాడారు. అంశాలపై మంత్రికి వివరించారు. త్వరలో రానున్న బక్రీద్ సందర్భంగా గోవధ చట్టం కఠినంగా అమలు చేయాలని భజరంగ్‌దళ్ నాయకులు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు పార్ధసారధి, జిఎం శేఖర్, జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వైఎస్ షర్మిలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నాం

- కాంగ్రెస్ ధికారంలోకి వస్తే 6 లక్షల వరకు బ్యాంకు లోన్లు రద్దు
- టిడిపి, వైకాపా మేనిఫెస్టోల కంటే కాంగ్రెస్ మేనిఫెస్టోనే బెటర్
- సీఎం వైఎస్ జగన్ అవినీతిపై కేంద్రం ఎందుకు స్పందించ లేదు
- కాంగ్రెస్ నేత తులసి రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత తులసిరెడ్డి



కాంగ్రెస్‌నేత తులసిరెడ్డిని సన్మానిస్తున్న నేతలు

**అనంతపురం, జూన్ 21 ప్రభాతవార్త బ్యూరో**

వైఎస్‌ఆర్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ శర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి వెల్లడించారు. దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తెగా గౌరవించి, కాంగ్రెస్ పార్టీకి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను గుర్తుంచుకుని వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన వెల్లడించారు. అయితే వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వస్తానని ఆమె స్వయంగా చెప్పడం లేదని కాంగ్రెస్ పార్టీ సమాధానం ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, టిడిపి మేనిఫెస్టోల కంటే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఎంతో బెటర్ అన్నారు. వాళ్ల మేనిఫెస్టోల గురించి ఆ రెండు పార్టీలు డప్పు కొడుతూ గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోనే ఎంతో బెటర్ అని ఆయన వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్నదాతలను ఆదుకునే విధంగా ఆరు లక్షల వరకు వ్యవసాయ బ్యాంకు రుణాలను తరుపున ఏఐసిసి నుంచి కానీ, ఎపి కాంగ్రెస్ పార్టీ తరుపున కానీ ఎలాంటి సమాచారం తమ వద్ద లేదన్నారు. తాను కూడా వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నట్లు సోషల్‌మీడియాలోనూ పత్రికల్లో ప్రచారం జరుగుతున్నట్లు నేను కూడా మీ మాదిరిగానే చూశానని, తనకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని విలేకర్లు అడిగిన ప్రశ్నకు తులిసరెడ్డ రద్దు చేస్తామని ఇదొక్కటి చాలు టీడీపీ, వైసీపీ మేనిఫెస్టోల కంటే బ్రహ్మాస్త్రం లాంటిదని ఆయన వెల్లడించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తామని ఆయన వివరించారు. జాతీయ మిగతా 4 లో

# విద్యా సంవత్సరం మారినా...రాని డైట్ బిల్లులు..!

- లబోదిబోమంటున్న ఎస్సీ ఎస్టీ, బీసీ హాస్టల్ వార్డెన్లు
- బీసీ వేల్ఫేర్‌లో బడ్జెట్ ఉన్నా మంజూరు కానీ వైనం
- తెలిసినా పట్టించుకోని ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు



అనంతపురం మూడవ రోడ్డులోని బీసీ హాస్టల్లో అన్నం తింటున్న విద్యార్థులు (ఫైల్)

**అనంతపురం న్యూటౌన్, జూన్ 21 ప్రభాతవార్త**

ప్రతి నెల హాస్టల్ విద్యార్థులకు మంజూరు చెల్లించాల్సిన డైట్ బిల్లులు విద్యా సంవత్సరం మారినా బిల్లులు మంజూరు కాలేదు. బీసీ హాస్టల్స్‌కు బడ్జెట్ పుష్కలంగా ఉన్నప్పటికీ మంజూరు చేయకపోవడంతో వార్డెన్లు లబోదిబోమంటున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్సీ-85,బీసీ-118, ఎస్టీ-19 హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో ఎస్సీ హాస్టల్స్‌కి సంబంధించి ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలకు, బీసీ హాస్టల్స్‌కు మార్చి, ఏప్రిల్ నెలలకు డైట్ బిల్లులు మంజూరు కాలేదు. బీసీ హాస్టల్స్‌కు బడ్జెట్ పుష్కలంగా ఉన్నప్పటికీ ఏబీసీడబ్ల్యూవోల లాగిన్‌లోనే బిల్లులు ముందుకు కదలకుండా ఆగిపోవడం గమనార్హం. ఇక ఎస్టీ హాస్టల్స్‌కు సంబంధించి బడ్జెట్ లేకపోవడంతోనే ఐదు నెలలకు పైగా డైట్ బిల్లులు పెండింగ్‌లో వున్నాయని పలువురు వార్డెన్లు చెబుతున్నారు. 2023-24 నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు పది రోజులు అవుతుంది. అయినా కూడా నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో కొందరు వార్డెన్లు వారి జీతం డబ్బుతో, మరి కొందరు వార్డెన్లు అప్పులు చేసి హాస్టల్స్‌ను నడుపుతున్నారు. ఈ విషయం ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు మంజూరు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

కనీసం ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను మంజూరు చేయాలని, ఇక ముమ్మందు కూడా ప్రతి నెల సక్రమంగా బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు వార్డెన్లు కోరుతున్నారు. అయితే దీనిపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

**బడ్జెట్ వచ్చిన వెంటనే చెల్లిస్తాం: ఎస్సీ వేల్ఫేర్ జేడీ మదుసూధన్‌రావు :** అనంతపురం జిల్లాలోని ఎస్సీ హాస్టల్స్‌కు సంబంధించి మార్చి, ఏప్రిల్,మే నెలల డైట్ బిల్లులకు బడ్జెట్ రాలేదు. త్వరలోనే బడ్జెట్ వస్తుంది. బడ్జెట్ వచ్చిన వెంటనే బిల్లులు చెల్లిస్తాం.

**బడ్జెట్ రాలేదు : డీఎస్‌డబ్ల్యూవో శివరంగప్రసాద్ :** శ్రీ సత్యసాయి జిల్లాలోని ఎస్సీ హాస్టల్స్‌కు సంబంధించి మార్చి, ఏప్రిల్, మే నెలల డైట్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్న మాట వాస్తవమే. బడ్జెట్ రాలేదు. బడ్జెట్ వచ్చిన వెంటనే మంజూరు చేస్తాం.

**ఐదు నెలలుగా పెండింగ్ ఉన్న మాట వాస్తవమే : డీటీడబ్ల్యూవో అన్నాదొరై :** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 19 ఎస్టీ హాస్టల్స్-రెసిడెన్సియల్ స్కూల్స్‌కు సంబంధించి ఐదు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్ ఉన్న వాస్తవమే. ప్రస్తుతానికి బడ్జెట్ రాలేదు. బడ్జెట్ వచ్చిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తాం.

**బడ్జెట్ ఉందన్న మాట వాస్తవమే : అనంతపురం బీసీ వేల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి :** అనంతపురం జిల్లాలోని బీసీ హాస్టల్స్‌కు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన డైట్ బిల్లులకు సరిపడే బడ్జెట్ వుంది. కానీ ఏబీసీడబ్ల్యూవోల లాగిన్‌లో బిల్లులు పాస్ చేయడానికి ఆన్‌లైన్‌లో ఆప్షన్ లేదని తెలిసింది. త్వరలోనే బిల్లులు మంజూరు చేస్తాం.

**టెక్నికల్ సమస్యతోనే పెండింగ్: డీసీడబ్ల్యూవో నిర్మలజ్యోతి :** శ్రీ సత్యసాయి జిల్లాలోని బీసీ హాస్టల్స్‌కు సంబంధించి మార్చి, ఏప్రిల్ నెలల డైట్ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బడ్జెట్ కూడా వుంది. కానీ టెక్నికల్ సమస్యల వలన బిల్లులు మంజూరు కాలేదు. త్వరలోనే సమస్యను పరిష్కరించి బిల్లులు మంజూరు చేస్తాం.

# 23 నుంచి టీడీపీ నేతల బస్సు యాత్ర

- కదిరి నుంచి ప్రారంభం
- బస్సు యాత్రలో చంద్రబాబు లేనట్లే..
- ఒక్కరోజు మాత్రమే చంద్రబాబు హాజరు..



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**అనంతపురం, జూన్ 21 ప్రభాతవార్త బ్యూరో**

టీడీపీ జిల్లా నేతలు ఈ నెల 23 నుంచి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. కదిరి నియోజకవర్గం నుంచి బస్సు యాత్ర 10 రోజులపాటు కొనసాగనుంది. బస్సు యాత్రలో భాగంగా పల్లె నిద్రలు కూడా చేయనున్నారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బస్సు యాత్ర నిర్వహిస్తారని మొదట్లో అందరూ భావించారు. అయితే టీడీపీ నేత చంద్రబాబునాయుడు 10 రోజుల్లో ఒక్క రోజు మాత్రమే ఏదో ఒక చోట పాల్గొంటారని సమాచారం. బస్సు యాత్ర మొత్తం చంద్రబాబునాయుడు పాల్గొనదని తెలియడంతో టీడీపీ క్యాడర్‌లో నిరుత్సాహం నెలకొంది. బస్సు యాత్రకు చంద్రబాబు వస్తే టీడీపీ క్యాడర్‌ను మరింత ఉత్సాహ పరిచినట్లు ఉంటుందని అందరూ భావించారు. అయితే జిల్లా నేతలు మాత్రమే బస్సు యాత్ర నిర్వహించే విధంగా పార్టీ ఆదేశాలు ఇవ్వడంతో ఆ మేరకు పార్టీ నాయకులు చర్యలు తీసుకున్నారు. టీడీపీ బస్సు యాత్రలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెంనాయుడు, ఇతర మాజీ మంత్రులు పాల్గొనే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు బస్సు యాత్రలో భాగంగా ఏ నియోజకవర్గానికి వస్తాదన్నది ఇంకా తెలియరావడం లేదు. తమతమ నియోజకవర్గాలకు చంద్రబాబును పిలిపించుకోవాలని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

# యోగసాధన ద్వారా శరీర ధారుడ్యం

- వ్యాయమంతో పాటు నడకను అలవర్చుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

**శ్రీసత్యసాయిజిల్లా, జూన్ 21, ప్రభాతవార్త ప్రతినిధి:**

యోగ సాధన చేయడం ద్వారా ద్వారా శరీర ధారుడ్యంతో పాటు మానసికంగా పరివర్తన చెందవచ్చని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లోని ప్రాంగణంలో 9వ అంతర్జాతీయయోగాడే వేడుకలను ఘనంగానిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్యఅతి థులుగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఓ భాగ్యరేఖ, మిగతా 3 లో





యోగా ఆసనాలు వేస్తున్న జిల్లా కలెక్టర్ దృశ్యాలు

# మూడు రిజర్వాయర్లు ఏమయ్యాయి.. జగన్‌రెడ్డి

- అట్టహాసంగా భూమి పూజ చేశారు.. కనీసం భూ సేకరణ అయినా జరిగిందా - మీరు రాప్తాడు రైతులకు చేసిన మోసాన్ని బస్సు యాత్ర ద్వారా వివరిస్తా.. - స్పష్టం చేసిన మాజీ మంత్రి పరిటాల సునీత



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

**రామగిరి, జూన్ 21 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే విధంగా తెలుగుదేశం పార్టీ హయాంలో రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుడితే వైసీపీ వచ్చిన తర్వాత రైతుల ఆశల్లో మట్టికొట్టారని, మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేది నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర ఈ నెల 29న రాప్తాడు నియోజకవర్గంలోకి రానున్న నేపథ్యంలోనామె నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. రామగిరి మండలం పేరూరు నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతున్న నేపథ్యంలో పేరూరు, దుబ్బార్లపల్లి, సోమవారవాండ్లపల్లి రిజార్వాయర్ ప్రాంతాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గతంలో హంద్రీనీవా నీటితో పేరూరు ప్రాజెక్టుకు శాశ్వతంగా నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో చేపట్టిన ప్రాజెక్టు గురించి గుర్తు చేసుకున్నారు. సుమారు 8 వందల కోట్లకు పైగా నిధులతో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తూ ప్రత్యేక కాలువ ద్వారా పేరూరు డ్యాంకు శాశ్వత ప్రాతిపదికన సాగు నీళ్లు అందించాలని ఈ రోజు ప్రాజెక్టు రూపకల్పన చేసినట్టు తెలిపారు. భూ సేకరణ కూడా దాదాపు పూర్తి చేసి పనులు ప్రారంభించి, 30 శాతం పనులయ్యే సమయానికి అధికారం కోల్పోవడం జరిగిందన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టులలో మార్పు తెచ్చారన్నారు. సీఎం జగన్ వర్చువల్ ద్వారా అట్టహాసంగా ఈ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారని, కానీ నేటికీ అందుకు సంబంధించి భూసేకరణ కూడా జరగలేదన్నారురిక్కడ ఇఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇప్పటికే ప్రాజెక్టు పూర్తి చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ మూడేళ్లైనా ఇది ముందుకు కదల్లేదన్నారు. ఇలాంటి ఎన్నో అంశాలను ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు వివరించేందుకే బస్సు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. అలాగే టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తామని సునీత అన్నారు. రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని సునీత పిలుపునిచ్చారు.

02ATP27_02ATP27.qxd 21-06-2023 PM 10:51 Page 1



## పశుభీమాపై రైతులకు అవగాహన సదస్సు



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

**బొమ్మనహాళ్, జూన్ 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని వైకెపి కార్యాలయంలో బుధవారం పశుభీమాపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఉరవ కొండ డాక్టర్ జి.వెంకటేషులు (డిడిఎహెచ్) మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వారి వద్ద ఉన్న పశువులకు తప్పనిసరిగా భీమా చేయించుకోవాలని ప్రీమియం చెల్లించిన పశువులకు ఏదైనా ప్రమాదం జరిగితే తప్పకుండా భీమా వర్తిస్తుందన్నారు. ఇది రైతులకు ఎంతో మేలని వారు తెలిపారు. అనంతరం బొమ్మనహాళ్ డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పాడి పశువులకు, గేదెలకు, గొర్రెలకు, పందులకు, పశుభీమా కల్పించడం జరుగుతుందని, రైతులకు వివరించారు. పశువులను బట్టి భీమా వర్తిస్తుందని, పశువులకు జబ్బులు చేసినా ప్రమాదం వల్ల కానీ, పిడుగు వల్ల కానీ, విష ప్రయోగం వల్ల కానీ పశువులు చనిపోతే భీమా వర్తిస్తుందని వారు రైతులకు వివరించారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కణేకల్లు డాక్టర్ నాంచారయ్య (డిఏవిహెచ్) ఎర్రగుంట డాక్టర్ మృదుల (విఎఎస్), ప్యారా సిబ్బంది (ఎహెచ్ఎఎస్) గోపాల మిత్ర, వారితోపాటు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది రైతులు దాకా హాజరైనట్లు వారు తెలిపారు.

## కుష్టి వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్, జూన్ 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొనగనహల్లి గ్రామంలో బుధవారం డాక్టర్ గీతాభార్గవి ఆధ్వర్యం లో కుష్టు వ్యాధి నివారణపై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో ఆమె మాట్లాడుతూ.. మైకో బ్యాక్టీరియం లెప్రీ అనే సూక్ష్మ జీవి ద్వారా చర్మానికి, నరాలకు సోకి స్పర్శలేని రాగిరంగు మచ్చలు వచ్చి కుష్టువ్యాధిగా గుర్తించ వచ్చని చర్మంపై స్పర్శలేదని తెలిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం అన్ని మందులు, పరీక్షలు ఉచితంగానే నిర్వహిస్తుందన్నారు. పరీక్షల్లో కుష్టు వ్యాధిగా తెలిస్తే భయపడాల్సిన అవసరం లేదని, తప్పకుండా ఆరు నెలల నుంచి 12 నెలలు ఉచితంగా అందించే మందులు వాడితే నయం అవుతుందని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు కుష్టు వ్యాధి పెద్ద వ్యాధి అని భయపడాల్సిన అవసరం లేదని క్రమం తప్పకుండా వైద్య సిబ్బంది అందించే ఉచిత మందులు వాడితే నయం అవుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, ఆశా వర్కర్లు గిరిజ, నాగమణి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంఈఓ గా సనోవర్‌బాష



ఎంఈఓను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

**డి.హిరేహాళ్ జూన్ 23 ప్రభాతవార్త :** డి.హిరేహాళ్ ఎంఈఓ గా సనోవర్‌బాష బుధవారం విధుల్లోచేరి బాధ్యతలు చేపట్టారు. ఆయన రొద్దం మండలం పెద్దమంతురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎఈఓగా డి.హిరేహాళ్ కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎఈఓ తిమ్మప్ప బదిలీపై వజ్రకరూరు మండల ఎంఈఓగా వెళ్ళారు. నూతన ఎంఈఓ కు ఏపీటీఎఫ్ నాయకులు జి.హోహన్‌రెడ్డి, బి.జాఫర్, వి.దేవరాజునాయక్, జి.తిప్పేస్వామి, గోవర్ధన్, జి.భాస్కర్‌బాబు, హిరాళప్ప స్వాగతం పలికి ఎమ్మార్సీలో సన్మానించారు.

## త్వరిత గతిన పనులు పూర్తి చేయాలి...ప్రత్యేకాధికారి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

**డి.హిరేహాళ్ జూన్ 23 ప్రభాతవార్త :** మండలంలో జరుగుతున్న వివిధ రకాల పనులను త్వరిత గతిన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్.డి.సి.ఎల్.ఎ. హెచ్చెల్సీ డి.హిరేహాళ్ ప్రత్యేకాధికారి ఎన్. వెంకటేశ్వర్లు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం డి.హిరేహాళ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైద్య, విద్య, మండల అభివృది, ఆర్‌డబ్ల్యూ ఎస్, గృహనిర్మాణ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమిక్షా సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో జరుగుతున్న నాడు-నేడు, గృహనిర్మాణ, జలజీవన స్రవంతి, సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, గడప గడపకు నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగవంతంకు చర్యలు చేపట్టి సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని ఇవి కలెక్టర్ ఆదేశాలని ఆయన ఆయా శాఖల అధికారులను హెచ్చరించారు. మండల పరిధిలో జలజీవన స్రవంతి పథకంలో మంజూరైన పనులు ప్రగతి ఏంటని ప్రత్యేకాధికారి ప్రశ్నించిగా 29 పనులు మంజూరయ్యాయని అందులో రూ.5 లక్షల లోపున్న నామినేటెడ్ పనులు 12 ఉండగా ఏడు పనులు పూర్తి అయ్యాయని మరో అయిదు పనులు ప్రగతి (ప్రోగ్రెస్)లో ఉన్నాయని మరో 17 టెండర్ పనులకు టెండర్లు వేయాల్సి ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికృష్ణనాయక్ తెలిపారు. గృహనిర్మాణం పనులపై ఆరాతీసి వాటికి నిర్మాణంకు సంబందించి మొబలైజేషన్‌కు రూ.20 వేలు ముందస్తుగా మంజూరవుతున్నందున లబ్దాదారులకు వివరించి నిర్మాణం పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని గృహనిర్మాణ శాఖ ఏఈ జమాల్‌బాషా ను ఆయన ఆదేశించారు. నాగలాపురం, డి.హిరేహాళ్ పీహెచ్‌సీల్లో నాడు-నేడు పథకం ద్వారా మంజూరైన ఆరు పడకల ఆసుపత్రి భవనాలు ల్యాబొరేటరీల నిర్మాణం పనుల గురించి వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ను విచారించి తెలుసుకున్నారు. మండలంలోని 16 పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు, ఓడిఎస్ శానిటేషన్ నులకు ఎంపికైన గ్రామాలు వాటిలోని ప్రగతి తదితర అంశాలను ఎంపీడీఓ కార్యలయం పరిపాలనాధికారి బలరాంరావు ను విచారించి పూర్తికాని పనులను వేగవంతంగా ముగించాలని ఆదేశించారు. వ్యవసాయంకు సంబందించిన వివరాలను వ్యవసాయాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఐసీడిఎస్ ద్వారా చిన్నారులకు, గర్భవతులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆశాఖ సూపర్‌వైజర్ ను, ప్రభుత్వ బి.సి. వసతిగృహం విద్యార్థుల వివరాలు, సౌకర్యాలు తదితర అంశాలను వార్డన్ సత్యనారాయణ ను విచారించారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయకపోతే శాఖా పరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన ఆయా శాఖల అధికారులను హెచ్చరించిరు. ఇందులో ఆరోగ్య కార్యకర్త శివకుమార్ పాల్గొన్నారు,

## రామలింగేశ్వర ఆలయాన్ని ప్రభుత్వం జాబితాలో చేర్చండి- బీజేపీ చక్రవర్తి



బీజేపీ కన్వీనర్ చక్రవర్తి

**కంబదూరు, జూన్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అండేపల్లి గ్రామ సమీపంలో కొండపై వెలసిన రామప్ప కొండగా పిలువబడే పురాతన రామలింగేశ్వర ఆలయానికి ఆలనా పాలనా లేక కనమరుగ య్యే స్థితిలో ఉందని కంబదూరు మండల బీజేపీ కన్వీనర్ చక్రవర్తి అన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆలయాన్ని పురావస్తు శాఖ అధికారులు సందర్శించి ప్రభుత్వ జాబితాలో చేర్చాలని ఆయన బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులతో పాటు ప్రజలపై కూడా ఉందని తెలిపారు.

## కంబదూరులో యోగా దినోత్సవ ర్యాలీ



విద్యార్థులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

**కంబదూరు, జూన్ 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కంబదూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ లలితమ్మ, యోగా మాస్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రత్యేక ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ పాఠశాల నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యార్థులు యోగా చేయడాన్ని అలవరుచుకొంటే మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని అన్నారు. ఏకాగ్రతతో యోగా చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని యోగా అవశ్యకత గూర్చి తెలియజేశారు. ఈ ర్యాలీలో పాఠశాల సిబ్బంది, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పుట్టినిల్లు ఆశ్రమం ప్రథమ వార్షికోత్సవం

**వజ్రకరూర్, జూలై 3 ప్రభాతవార్త:** పుట్టినిల్లు ఆశ్రమం ఏర్పాటు చేసి ప్రథమ సంవత్సరం పూర్తయిన సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నిర్మల మురళి, సభ్యులు మురళికృష్ణ, క్రిష్ణవేణి, చిరంజీవి సాయి సిద్ధార్థలు కలిసి గోశాలలో గోసేవ నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే పలురకాల కార్యక్రమాలను గురించి అక్కడ వారికి వివరించారు. అనంతరం పుట్టినిల్లు ఆశ్రమ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జూన్ 21 ప్రభాతవార్త :** మండల పరిధిలో బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోజు ఆ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్న, డి.వెంకటేష్, గుండ్లపల్లి క్లస్టర్ సిఆర్‌పి నరసింహులు ఆధ్వర్యంలో 1వ తరగతికి చేరిన విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలుగుతూ సక్రమంగా చదువుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన నోడల్ ఆఫీసర్



జగన్ లే ఔట్‌ను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్

**బెలుగుప్ప, జూన్ 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి రామచంద్ర, కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన నోడల్ ఆఫీసర్ జి.శంకరయ్య ఆధ్వర్యంలో జగన్ లే ఔట్లు, నాడు నేడు కింద చేపడుతున్న పనులు, గ్రామ సచివాలయ అధికారులు, విఆర్ఓలు అసిస్టెంట్ ఇంజినీర్లు, మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ప్రతి అధికారి త్వరలో ఇళ్లను జగన్ లే ఔట్ ఇళ్లను జగన్ సురక్ష పథకంపై వచ్చిన సచివాలయ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. అందులోభాగంగా ప్రతి గ్రామంలో మూడు రోజులు జగన్ సురక్ష క్యాంపును ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం సీర్పి, ఎరగుడి, బెలుగుప్ప గ్రామాల్లో జగన్ లేఔట్లు, ఇళ్ల నిర్మాణం, నాడు నేడు కింద చేపట్టిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లారెడ్డి, తహశీల్దారు ఓబులేసు, ఎంపిపి అధ్యక్షులు పెద్దన్న, మండల కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా చర్యలు...

**- నీటి పంపిణీలో మరో పది రోజుల పాటు సంయమనం పాటించి సహకరించండి.... - మున్సిపల్ కమీషనర్ వి.మల్లికార్జున**



విలేఖరుల సమావేశంలో మున్సిపల్ కమీషనర్ మల్లికార్జునతో పాటు ఇంజనీర్లు తదితరులు.

**గుంతకల్లు, జూన్ 21 ప్రభాతవార్త :** గత కొద్ది రోజులుగా గుంతకల్లు పట్టణంలో త్రాగు (మంచి) నీటి పంపిణీలో జరుగుతున్న సమయపాలన సమస్య పట్ల ప్రజలు ఎంతో సంయమనంతో సహకరిస్తుండటం అభినందనీయమని మున్సిపల్ కమీషనర్ వి.మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం గుంతకల్లు పురపాలక సంఘం కార్యాలయంలోని తన కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల మేరకు... గుంతకల్లు పురపాలక సంఘం పరిధిలోని ఆయా ప్రాంతాలలో కొళాయిల ద్వారా మున్సిపాల్టీ సరఫరా చేస్తున్న త్రాగునీరు (మంచినీరు) అందించడంలో కొంతమేర జాప్యం జరిగింది వాస్తవమేనన్నారు. పట్టణంకు సరఫరా చేస్తున్న ఎస్ఎస్ ట్యాంకులలో దాదాపు 100రోజులకు గాను సరిపడు నీటి నిలువ సమృద్ధిగా ఉందన్నారు. గుంతకల్లు పట్టణ విస్తీర్ణతతో పాటు జనాభా పెరుగుదల పట్ల కావలసిన నీటి సామర్థ్యంపై గణాంకాలు చేపట్టామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు అమృత్ ఫేస్-1, అమృత్ ఫేస్-2ల నిధులతో ప్రస్తుతం ఉన్న రెండు ఎస్ఎస్ ట్యాంకుల నిలువ 21ఎంఎల్‌డి సామర్థ్యం ఉందని, కాని పట్టణానికి గాను తమ లెక్కింపు మేర 25ఎంఎల్‌డి సామర్థ్యం అవసరమని గుర్తించామన్నారు. ఆమేర నీటి నిలువ సామర్థ్యంపై తగు చర్యలను తీసుకోవడానికి అవశ్యమైన నూతన ప్రణాళికలను తయారు చేయనున్నామన్నారు. సదరు నీటి సమస్య విషయంలో ఎంఎల్ఏ వై.వెంకట్రామిరెడ్డి స్థానిక ప్రజల ఇబ్బందుల పట్ల స్పందించారని, త్వరలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సమీక్షించి అందుకు అవసరమైన దాదాపు రూ.5కోట్ల మేరకు ప్రత్యేక నిధుల కేటాయింపుకు కృషి చేస్తున్నట్లు తెలిపారన్నారు. గత కొద్ది రోజుల క్రితం నీరు రంగు మారిన వైనంపై అధ్యయనం చేశామని, గతంలో ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణంలో పలు తప్పిదాలు జరిగినట్లు గుర్తించామని, ఆయా తప్పిదాల పట్ల తాత్కాలిక మరమ్మత్తులను చేపడుతున్నామన్నారు. మంచినీటి పంపిణీ పట్ల భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. రెండు ఎస్ఎస్ ట్యాంకుల ఫిల్టరేషన్ ప్లాంట్లు గత 1994లో ఒకటి 2009లో మరొకటి ఏర్పాటు చేశారని, అప్పటి నుండి వాటి మార్పు విషయంలో తగు చర్యలు లేమిగా ఉండటం నీటి రంగు మార్పుకు ఒక కారణం ఉండవచ్చని, వాతావరణంలో వేసవి తాపం తీవ్రత కూడా మరో కారణంగా ఉండవచ్చన్న సత్యాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఆ దిశలో తమ తనిఖీలలో భాగంగా ప్రస్తుతం ఫిల్టర్‌బెడ్‌ల మార్పుగా చర్యలు చేపట్టామన్నారు. పట్టణ వాసులకు సురక్షిత నీటిని అందించడమే లక్ష్యంగా చర్యలను తీసుకుంటున్నామని, ఈ మేర ప్రస్తుతం దాదాపు 10రోజుల పాటు నీటి పంపిణీలో సమయపాలనలో జాప్యం జరుగుతుందన్న వాస్తవాలను ప్రజలు గుర్తించి మున్సిపాలిటీకి సహకరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఈశ్వరయ్య, డిఇ హేమచంద్ర, ఎఇ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యకర్తకు ఘన సన్మాణం



సన్మానం చేస్తున్న దృశ్యం

**గోరంట్ల, జూన్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎగువ గంగంపల్లి పంచాయతీ దిగువ గంగంపల్లి అంగన్వాడి కార్యకర్త శాంతమ్మ ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా బుధవారం సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ గ్రామంలో తలలో నాలుకలా అంగన్వాడి కార్యకర్త ఉండాలని గ్రామాన్ని తన కుటుంబంలా తీర్చిదిద్దాలని అందుకు ఉదాహరణ శాంతమ్మ అని, గత మూప్పై సంవత్సరాలుగా ఆమే చేసిన సేవలు మరవలేనివి అని కోనియాడారు. అదేవిదంగా తన తోటి అంగన్వాడి కార్యకర్తలు ఇలా సన్మాణించడం సంతోషంగా ఉందని ఉద్యోగవిరమణతో చిన్న పిల్లలకు దూరంగా జీవించాల్సి రావడం చాలా భాధాకరమని ఉద్యోగ నిర్వహనలో తోటి అంగన్వాడి ఉపాధ్యాయుల సహకారం మరవలేనిదని శాంతమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో గోరంట్ల సెక్టార్ అంగన్వాడి కార్యకర్తలు మరియు సూపర్వైజర్ సుశీల సౌభాగ్యమ్మ, ఏ ఎన్ ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న తేదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు

**మడకశిర జూన్ 21 ప్రభాతవార్త;** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర ద్వారా మినీ మేనిఫెస్టో రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా ఈనెల 26వతేది సోమవారం మడకశిర నియోజకవర్గంలో జరిగే బస్సు యాత్రను నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తేదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇంఛార్జ్ గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మరియు వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ఆగిపోయిన అభివృద్ధి పనులను సందిర్శిస్తూ సెల్ఫీ ఛాలెంజ్ ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ప్రతిపాదిత రాళ్ళపల్లి రిజర్వాయరు స్థలాన్ని సందర్శిస్తామని లెలియజేశారు. చైతన్య రథయాత్ర సోమవారం ఉదయం 9 గంటలకే కల్లుమర్రి గ్రామంలో ప్రవేశించడం జరుగుతుందని అక్కడ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మడకశిరలో ప్రవేశించి చీపులేటిలో ప్రారంభంకాని గార్మెంట్స్ ను సందర్శించి జగన్మోహన్‌రెడ్డికి సెల్ఫీ చాలెంజ్ ద్వారా తెలియజేస్తామని అనంతరం పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి అంబేద్కర్ విగ్రహానికి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామని అన్నారు. రింగ్ రోడ్డు 50కోట్లతో మంజూరు చేసి పెనుకొండ రోడ్డులో భూమి పూజ చేసి 30 శాతం పనులను పూర్తీచేస్తే ఆ బిల్లులను మంజూరు చేయకుండా పనులను రద్దు చేశారని అన్నారు. మడకశిర భూమికి కృష్ణ జలాలను అందిస్తానని మాటిచ్చి నీటిని అందించిన మొదటి పార్టీనాయకుడు చంద్రబాబునాయుడుని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ సాయంత్రం 4గంటలకు గుడిబండలో బహిరంగసభ నిర్వహిస్తామని అన్నారు. వైకాపా ప్రభుత్వ అరాచకమైన పరిపాలన దుర్మార్గమైన పరిపాలన బందిపోట్ల పరిపాలన రాష్ట్రంలో జరుగుతుంది కాబట్టే ఈరావణ రాజ్యాన్ని తరిమితరిమి కొట్టడానికే ఈ బస్సుయాత్ర కు స్వీకారం చుట్టబడిందని అన్నారు. ఆ బస్సు యాత్ర ద్వారా మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టో ద్వారా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఈ మేనిఫెస్టోలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డనిధిక్రింద రూపాయలు 1500, తల్లికి వందనం క్రింద చదువుకొనే పిల్లలను ఏటా రూపాయలు 15000, దీపం పథకం క్రింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని, మహిళలందరికి ఉచితంగా బస్సు ప్రయాణం అని, యువగళం నిధి క్రింద నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు ప్రతి నిరుద్యోగికి నెలకు రూపాయలు 3000అని, అన్నదాత పథకం క్రింద ప్రతి రైతుకు ఏడాదికి రూపాయలు 20000 ఆర్థిక సాయం అందిస్తామని బిసీల రక్షణ చట్టం తీసుకొస్తున్నామని భరోసా ఇచ్చారు. ఈ బస్సు యాత్రలో ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు నందమూరి బాలకృష్ణ, కాలువ శ్రీనివాసులు, బికె.పార్థసారథి, పయ్యావులకేశవ్, పరిటాలసునీత, పల్లె రఘునాథరెడ్డి, పరిటాలశ్రీరామ్, తదితర నియోజకవర్గ ఇంచార్జ్‌లు ముఖ్యనాయకులు పాల్గొంటారని అన్నారు. కావున నియోజకవర్గంలోని తెలుగుదేశంనాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మల్లికార్జున, డాక్టర్ కృష్ణమూర్తి, తలమర్ల సుబ్బరాయుడు, బేగార్లపల్లి రవి, లక్ష్మీనారాయణ, భక్తర్ బూదిపల్లి జయరాం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్ళ స్థలాలు ఇస్తాం

### -ఆర్‌డిఓ భాగ్యరేఖ



గుడారాలు వేసుకున్న ప్రజలతో మాట్లాడుతున్న ఆర్‌డిఓ భాగ్యరేఖ, రెవెన్యూ అధికారులు

**కొత్తచెరువు, జూన్ 21, ప్రభాతవార్త :** అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ స్పష్టం చేశారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని నల్లగుట్టలో సిపిఐ, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో పేదలు వారం రోజులుగా గుడారాలు వేసుకొని తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించడంతో బుధవారం పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ, కొత్తచెరువు తహశీల్దార్ రామాంజినేయులు రెడ్డి, సిఐ రాగిరి రామయ్య, ఎస్ఐ లింగన్నలు అక్కడకు చెరుకొని నిరసన చేస్తున్న వ్యక్తులను సముదాయించారు. ఇప్పటికే ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవారికి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జగనన్న లే ఔట్లలో ఇళ్ళ స్థలాలను మంజూరు చేసి ఇళ్ళు నిర్మించి ఇస్తోందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే సంబంధిత సచివాలయాల్లో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ళు పథకం క్రింద ఇంటి పట్టాలకు దరఖాస్తు చేసుకున్న 90 రోజులలోపు మంజూరు చేయబడతాయని అధికారులు తెలియజేశారు. జులై 1వ తేది నుండి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమౌతున్నదని, ఈ కార్యక్రమం ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఏఏ సంక్షేమ పథకాలు అందాయని అన్ని శాఖల అధికారులు స్వయంగా గ్రామాల్లో పర్యటించి వివరాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో అర్హత ఉండి ఇంటి పట్టా కానీ, ఇళ్ళు కానీ మంజూరు కాకపోతే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కావున ఇంటి పట్టా కోసం ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంఘం నాయకులు వేమయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిండెంట్ రమణ, సంయుక్త కార్యదర్శి కొండప్ప, సిపిఐ ప్రధాన కార్యదర్శి గౌస్‌లాజం, గంగాధర్, మహిళా సంఘం నాయకులు రమణమ్మ, ఈశ్వరమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ళు అరెస్ట్

**బుక్కపట్నం, జూన్ 21, ప్రభాతవార్త :** మండలంలోని గ్రామాలలో జూదం ఆడుతున్న కొంత మంది వ్యక్తులను బుక్కపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలియజేశారు. రాబడిన సమాచారం మేరకు గసిక వారిపల్లి గ్రామ శివార్లలోని చెరువు దగ్గర కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారిపై రైడ్ చేసి 6 మందిని పట్టుకొని వారి దగ్గర ఉన్న రూ.15,260ల నగదు, 6 సెల్‌ఫోన్‌లు, 7 మోటార్ సైకిల్‌లను సీజ్ చేసి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కాగా, ఈ ప్రాంతంలో కోండాపురంకు చెందిన ఓ వైసిపి యువనాయకుడి ఆధ్వర్యంలో ఈ జూద కేంద్రాలు నడుపుతున్నట్లు తెలిసింది. గతంలో కూడా పలు అసాంఘిక కార్యకలాపాల్లో ఈ యువకుడు పాల్గొన్నట్లు సమాచారం.

## కృషి విజ్ఞాన కేంద్రానికి భూమి కేటాయించండి

**- జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు**



జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్న శాస్త్రవేత్తలు దృశ్యం

**పుట్టపర్తి, జూన్ 21, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లాకు మంజూరైన కృషి విజ్ఞాన కేంద్రానికి కావాల్సిన భూమిని కేటాయించాలని ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబును కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం నందు నంద్యాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం అసోసియేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయల సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య, నంద్యాల ప్రాంత పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త సతీష్‌లు జిల్లా కలెక్టర్‌ను కలుసుకొని విజ్ఞప్తి చేశారు.

## శ్రీచైతన్య, నారాయణ పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోండి -ఎస్ఎఫ్ఐ



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**కొత్తచెరువు, జూన్ 21. ప్రభాత వార్త :** ప్రభుత్వ గుర్తింపులేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం నారాయణ ఈ టెక్నో స్కూల్ నందు విద్యార్థి సంఘాల నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి పాఠశాలలపై అధిక ఫీజులు, అక్రమ అడ్మిషన్ల నిర్వహణపై ఫిర్యాదులు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని పెనుకొండ రహదారిలో ఉన్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు లేనప్పటికీ పాఠశాల యాజమాన్యం అక్రమంగా అధిక ఫీజులతో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు తెలియజేశారు. అలాగే నారాయణ పాఠశాలలో 1 నుండి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ 10వ తరగతి వరకు అడ్మిషన్లు కొనసాగిస్తురని, నిబంధనల మేరకు విశాలమైన తరగతి గదులు లేకపోయినప్పటికి అధిక సంఖ్యలో అడ్మిషన్లు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూళ్ళు చేస్తున్నట్లు ఆరోపించారు. కేవలం పాఠ్యపుస్తకాల కోసమే రూ. 6వేల నుండి రూ.12 వేల వరకు వసూళ్ళు చేస్తున్నట్లు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. అలాగే బస్సు ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, యూనిఫాంలు, షూలు, బెల్టు, బ్యాడ్జి, సాక్సులు తదితర వస్తులను తమ ఇష్టాను సారం అధిక ధరలకు అమ్ముకుంటూ పాఠశాలలను వ్యాపార కేంద్రంగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవే కాక మరికొన్ని ప్రైవేటు పాఠశాలలు సైతం అధిక ఫీజులు వసూళ్ళు చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని వ్యాపార కేంద్రాలుగా మార్చుకొని అమ్ముకుంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలోనే ఇలా ఉందంటే ఇక జిల్లా వ్యాప్తంగా విద్యాధికారుల పర్యవేక్షణ తీరు ఏమిటో అర్థమౌతుందన్నారు. ఇప్పటికైనా మాముళ్ళ మత్తు వదిలి అధికారులు గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయడంతో పాటు సంబంధిత ప్రైవేటు పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు మురళీ, భరత్, నవీన్, చరణ్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

